


www.manavaarthamirror.com

మన వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం

31 ఆగస్టు 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# సమగ్ర ప్రగతికి వెయ్యి రోజుల బాట



## సంక్షేమం-అభివృద్ధికి సమాన ప్రాధాన్యం

**సామాజిక న్యాయానికి కీలక నిర్ణయాలు**

**రైతులు, మహిళలు, యువతకు అండగా పథకాలు**

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కొత్త శిఖరాలకు తీసుకెళ్లే లక్ష్యం**

**మౌలిక వసతులు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం**

**వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం విడుదల చేసిన ప్రగతి నివేదిక**

హైదరాబాద్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 1 నాటికి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం ప్రగతి నివేదికను విడుదల చేసింది. సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు, మహిళలు, యువతకు భరోసా కల్పించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంచడం, విద్య, వైద్యం, మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను నివేదికలో వివరించింది. భవిష్యత్తు తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి జరిగేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందేలా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు పేర్కొంది. 2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ తలసరి ఆదాయం కంటే దాదాపు 91 శాతం అధికమని ప్రభుత్వం తెలిపింది. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతుల సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్లను వెచ్చించినట్లు పేర్కొంది. రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు ఊరట కల్పించామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించామని వివరించింది. వరి సాగు, ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం ప్రభుత్వం నిరంతరం పోరాడుతోందని పేర్కొంది. మహిళలకు ఆర్థిక భారం తగ్గించే దిశగా మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయిందని ప్రభుత్వం తెలిపింది. గృహజ్యోతి పథకం కింద 53 లక్షలకుపైగా కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని

(మిగతా 2వ పేజీలో)



# నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణవాసుల ఆచూకీ కోసం ముమ్మర

కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం

గల్లంతైన వారి గుర్తింపునకు నేపాల్ డిజాస్టర్ పోర్టల్ కీలకం

స్వస్థలాల్లోనే డీఎన్ఏ నమూనాల సేకరణకు ఏర్పాట్లు

పార్థివదేహాల తరలింపు ప్రక్రియ వేగవంతం

బాధిత కుటుంబాలకు నిరంతరం అధికారిక సమాచారం

హైదరాబాద్ : నేపాల్‌లో ప్రకృతి విపత్తు సృష్టించిన విషాదం ఇప్పుడు అక్కడి సరిహద్దులను దాటి తెలంగాణలోని అనేక కుటుంబాల్లో ఆందోళనకు కారణమైంది. వరదలు, కొండచరియలు, ఆకస్మిక వాతావరణ మార్పులతో నేపాల్‌లో పలుచోట్ల రాకపోకలు స్తంభించిపోవడంతో అక్కడ పర్యటిస్తున్న భారతీయుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ కుటుంబాల పరిస్థితి మరింత వేదనకరంగా ఉంది. బంధువులు క్షేమంగా ఉన్నారనే సమాచారం కోసం ప్రతి నిమిషం ఎదురుచూస్తున్న కుటుంబాలకు అధికారికంగా అందే ప్రతి సమాచారం ఎంతో విలువైనది. ఇలాంటి సమయంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ శాఖ, కఠ్మాండులోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో సమన్వయం చేస్తూ రక్షణ, గుర్తింపు చర్యలను వేగవంతం చేయడం అవసరమైన చర్య. అయితే ఈ ప్రయత్నాలు

(మిగతా 2వ పేజీలో)



3 దశాబ్దాల నిరీక్షణకు తెర..

# రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

::: సీఎం చంద్రబాబు ట్వీట్

**మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు**

**30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి**

**నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు**

**తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం**

**రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు**

మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని

(మిగతా 2వ పేజీలో)

# హైదరాబాద్‌లో 183 కోట్ల భారీ జీఎస్టీ

హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ జీఎస్టీ మోసం

వ్యాపార సంస్థ జీఎస్టీ ఖాతా హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు

రూ.183.61 కోట్లకు 730 నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టి

అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందేందుకు యత్నం

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు, దర్యాప్తు



హైదరాబాద్ : హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ వ్యాపార సంస్థకు చెందిన జీఎస్టీ ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏకంగా రూ.183.61 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ మోసం వెనుక

(మిగతా 2వ పేజీలో)



భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్..

# 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

**పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉజ్బెకిస్థాన్ నిర్ణయం**

**గతేడాది తొలిసారి 1 బిలియన్ డాలర్లు దాటిన ద్వైపాక్షిక వాణిజ్యం**

**భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని చెప్పిన ఆ దేశ అధ్యక్షుడు**

**ప్రధాని మోదీ తాష్కెంట్ పర్యటనలో వెలువడిన ఈ కీలక ప్రకటన**



# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమే

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి

సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా

# ఈ ఉచిత పథకాలు ఎవరడిగారు? :: తెలంగాణ సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం

**కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు సందేహాలు**

**శాసనసభ ఆమోదం లేకుండా ప్రజాధనం పంపిణీపై ప్రభుత్వానికి ప్రశ్నలు**

**ఉద్యోగుల జీతాలు, బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఉచితాలపై ఆగ్రహం**

**నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం**



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు తీవ్ర సందేహాలను వ్యక్తం చేసింది. శాసనసభ ఆమోదం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ద్వారా ఈ పథకాలను ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకాలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ బుధవారం విచారించారు. చట్టసభ ఆమోదం లేకుండా ప్రజాధనాన్ని పంపిణీ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ పథకాలకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు జీతాలు ఆలస్యమవుతున్నాయి, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి, నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారు. మరోవైపు రాష్ట్రం అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉంటే ఉచితాలు ఇవ్వవచ్చని, కానీ చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేశారని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్లు అనర్హులకు అందాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ తరపున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. అయితే, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

# టీసీ కోసం వస్తే వేధింపులు.. ప్రిన్సిపాల్ జననాంగాన్ని కొరికిన విద్యార్థి!

**నాగర్‌కర్నూల్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు**

**టీసీ కోసం వస్తే లైంగిక దాడికి యత్నించారని విద్యార్థి ఫిర్యాదు**

**దాడి నుంచి తప్పించుకునేందుకు ప్రిన్సిపాల్ జననాంగాన్ని కొరికిన విద్యార్థి**

**ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన**

**ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు**



నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఓ విస్మయకర ఘటన వెలుగులోకి వచ్చింది. టీసీ (బదిలీ ధృవీకరణ పత్రం) కోసం వచ్చిన ఓ విద్యార్థిపై లైంగిక దాడికి యత్నించిన ప్రిన్సిపాల్‌పై సదరు విద్యార్థి ప్రతిఘటించాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే, జగిత్యాల జిల్లాకు చెందిన ఓ విద్యార్థి కొల్లాపూర్ పీజీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. తన చదువుకు సంబంధించిన టీసీ కావాలని కోరగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనీస్ లైంగికంగా సహకరించాలని సదరు విద్యార్థిని వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో జులై 7వ తేదీ రాత్రి ప్రిన్సిపాల్ తన నివాసానికి విద్యార్థిని పిలిపించి, లైంగిక దాడికి యత్నించాడు. ఆయన బారి నుంచి తప్పించుకునే క్రమంలో విద్యార్థి ప్రతిఘటించి, ప్రిన్సిపాల్ జననాంగాలను కొరికి గాయపరిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన ప్రిన్సిపాల్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన అనంతరం బాధితుడు తన స్నేహితుల సాయంతో కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటన జరుగుతున్న సమయంలో తన స్నేహితులు వెలుపల ఉండి వీడియో తీశారని విద్యార్థి పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న ప్రిన్సిపాల్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘాలు కళాశాల వద్ద ఆందోళనకు దిగాయి. నిందితుడైన ప్రిన్సిపాల్‌ను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. విషయం తెలుసుకున్న పాలమూరు విశ్వవిద్యాలయ అధికారులు కళాశాలను సందర్శించి విచారణ చేపట్టారు. బాధ్యుడైన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఉదంతంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన.. సంయమనం పాటించాలని పిలుపు

**చర్చలతో సమస్య పరిష్కరించుకోవాలని హితవు**

**పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**అంతర్జాతీయ వాణిజ్యానికి ముప్పు కలిగించొద్దని విన్నపం**

**దౌత్యా మార్గాన్నే ఆశ్రయించాలని పిలుపు**




పశ్చిమాసియాలో తాజా ఉద్రిక్త పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ జలమార్గాల మీదుగా వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడులు జరగడం, ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరగడం శాంతి, భద్రత, స్థిరత్వానికి ముప్పుగా మారుతాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించి ఉద్రిక్తతలను తగ్గించాలని సూచించింది. పౌరుల భద్రతతో పాటు ఇంధన సరఫరా, వాణిజ్య కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని కోరింది. శాశ్వత పరిష్కారం కోసం మళ్లీ చర్చలు, దౌత్య మార్గాన్నే ఆశ్రయించాలని పిలుపునిచ్చింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ దాదాపు ముగిసిందని వ్యాఖ్యానించిన నేపథ్యంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్‌పై మరోసారి సైనిక దాడులకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే నౌకలపై దాడులకు ప్రతిస్పందనగానే అమెరికా తాజా దాడులు చేపట్టిందని తెలిపారు. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆరు శాతానికి పైగా పెరిగాయి. ఇరాన్ సైనిక లక్ష్యాలపై అమెరికా దాడులు జరిపినట్లు అమెరికా రక్షణ శాఖ కూడా వెల్లడించింది.

# వివరణ ఎందుకు ఇస్తా?: కొండా సురేఖ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కడియం శ్రీహరి

తనకు చెందిన దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరిని వివరణ కోరాలని... విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆమె కోరారు. సురేఖ చేసిన ఫిర్యాదుపై కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. "నేను ఏ తప్పూ చేయలేదు. అలాంటప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తాను ఎప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేసిన కడియం... ఇదంతా కేవలం అవగాహన లోపం వల్లనే జరుగుతోందని అన్నారు. దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక ప్రజాప్రతినిధిగా తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. "నా నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశాను. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష నిర్వహించలేదు. కేవలం క్షేత్రస్థాయి సమస్యలను మాత్రమే వారి దృష్టికి తీసుకెళ్లాను" అని వివరించారు. దేవాదాయ శాఖలో నిధులు లేవని చెప్పడంతో... ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ఎస్టిమేషన్‌లను (అంచనాలను) మాత్రమే కోరినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై కొండా సురేఖను ఉద్దేశించి కడియం శ్రీహరి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ... వార్తల్లో ఉంటూ ప్రజల మధ్య బతకాలని చూస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం తాను ఎవరినైనా



కలుస్తానని... అవసరమైతే మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసి నిధులు సాధించుకుంటానని స్పష్టం చేశారు.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా: హరీశ్

హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

# 'మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం'.. కిషన్‌రెడ్డిపై భట్టి ఫైర్

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ కేటాయించినప్పటికీ మైనింగ్ లీజుకు అవసరమైన అనుమతులు మాత్రం ఇవ్వలేదని చెప్పారు. కొత్త చట్టం ప్రకారం తాడిచెర్ల-2ను సింగరేణికి ఇవ్వబోమని కేంద్రం చెప్పిందన్నారు. అయితే ఆ చట్టం అమల్లోకి రాకముందే ఈ బ్లాక్ సింగరేణికి కేటాయించిన విషయాన్ని తాము ప్రధాని, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పోరాడటంతో చివరకు అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. అదే తెలంగాణ ప్రయోజనాలను కాపాడే నిర్ణయమవుతుందని అన్నారు.

# ఇరాన్ నన్ను హత్య చేయాలని చూస్తోంది: ట్రంప్ సంచలన ఆరోపణలు

కొనసాగిస్తోందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నాయకత్వం గతంతో పోలిస్తే కొంత హేతుబద్ధంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న చర్చలు ఇక ప్రయోజనం లేవని ట్రంప్ స్పష్టం చేశారు. "ఈ రాత్రే ఇరాన్‌పై మళ్లీ తీవ్ర దాడులు చేస్తాం. వారు రోజూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారు" అని హెచ్చరించారు. కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చర్చలు కొనసాగించాలని చర్చల బృందం భావిస్తే కొనసాగించవచ్చని, కానీ వాటిపై తనకు నమ్మకం లేదన్నారు. మరోవైపు, అమెరికా బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో తమ సైన్యానికి చెందిన ఎనిమిది మంది సైనికులు మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. దక్షిణ ఇరాన్‌లోని బందర్ అబ్బాస్, బుషెహర్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయని పేర్కొంది. అమెరికా ఏకపక్ష దాడులతో ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# పవన్ వీరాభిమాని నిరంజన్ మృతి

**అరుదైన జన్యు వ్యాధితో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**

**నిరంజన్ మృతిపై డిప్యూటీ సీఎం పవన్ తీవ్ర దిగ్భ్రాంతి**

**వీడియో కాల్ ద్వారా కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చిన సోనూసూద్**

హన్మకొండ : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని అయిన పొనుగంటి నిరంజన్ (17) అనారోగ్యంతో కన్నుమూశాడు. హన్మకొండకు చెందిన నిరంజన్, అరుదైన జన్యుపరమైన వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. తీవ్ర అనారోగ్యంతో పోరాడుతున్నప్పటికీ, జీవితంపై కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న నిరంజన్ మరణవార్త అందరినీ కలచివేసింది. నిరంజన్ మరణం గురించి తెలుసుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం తనను ఎంతగానో బాధించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరంజన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు ప్రముఖ నటుడు సోనూసూద్ సైతం ఈ విషయం తెలిసి స్పందించారు. నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో వారికి అన్ని విధాలా అండగా ఉంటానని, భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తాను ఉన్నానంటూ భరోసా ఇచ్చారు.

# గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా మోడల రవి సగర ఎన్నిక

**- ప్రధాన కార్యదర్శిగా ఆవుల వెంకట్ రాములు సగర-**
**కోశాధికారిగా మార్క సతీష్ సగర ఏకగ్రీవ ఎన్నిక**





తెలంగాణ మన వార్త మిర్రర్ ప్రతినిధిగ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ఎన్నికలలో మోడల రవి సగర ఎన్నికయ్యారు. ఆదివారం సూరారంలోని వి ఐ పి ఫంక్షన్ హాల్ లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అస్కానీ మారుతీ సాగర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.రామ్మోహన్ సాగర్ ల ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్ లో భాగంగా నామినేషన్ విత్ డ్రా సమయం లోపు ప్రధాన కార్యదర్శి గా ఆవుల వెంకట్రాములు సగర, కోశాధికారి గా మర్క సతీష్ సగర లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అధ్యక్ష స్తానానిక్ జరిగిన ఎన్నికలలో భీమరాజు వేణు పై మోడల రవి సగర విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులకు ఎన్నికల అధికారులు విజయ పత్రాలను అందజేశారు. ఈ ఎన్నికలలో ఓటరు జాబితా ప్రకారం 300 ఓటర్లు ఉండగా 209 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుని పదవికి మాత్రమే జరిగిన ఈ ఎన్నికలలో అంజయ్యనగర్ కు చెందిన మోడల రవి సగర విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అస్కాని మారుతీ సగర మాట్లాడుతూ కుల చైతన్యాన్ని ప్రదర్శిస్తూ ఓటర్లు ఉత్సాహంగా ఎన్నికలలో భాగస్వాములు కావడం శుభ పరిణామమని, ఎన్నికలు సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రాంతీయ సంఘాల నాయకత్వాలకు, ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఎన్నికలను రాష్ట్ర సగర సంఘం నాయకులు పర్యవేక్షించారు.

# విదియ పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

**స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ**
**ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ**



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 30 ఆదివారం భానువాసరే శ్రావణ మాసం శుక్ల పక్షం విదియ పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వద్ల గట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వద్లగట్ట శంకర్, సహాయ కోశాధికారి గోపి, భారతాల రాజసాగర్, పూరెల్లి రాజన్న, వేముల రాజేష్, యాంసాని శంకరయ్య, ప్రవీణ్ కుమార్ -ప్రియదర్శిని, లక్ష్మి నారాయణ -జ్యోతి, భారతి, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. సూర్యుని మంత్రం: ఓం భాస్కరాయ విద్మహే మార్తశీడాయ దీమహే తన్నో సూర్య ప్రచోదయాత్. ఓం సూర్యాయ నమః

# ఎమ్మెల్సీ రహమత్ బేగ్ ను ఎన్కౌంటర్ చేయాలి.

**-కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు నోట్లో బెల్లం పెట్టుకున్నారా?**
**-బిజెపి రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్.**



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 30

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై ఎంఐఎం పార్టీకి చెందిన శాసనమండలి సభ్యులు మీర్జా రహమత్ బేగ్ అత్యాచారానికి పాల్పడడం హేయమైనా చర్య అని తెలంగాణలోని ప్రతి ఒక్కరు ఇట్టి సంఘటన ఖండించాలని రహమత్ బేగ్ శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేసి వెంటనే ఎన్కౌంటర్ చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టసభల్లో చట్టాలు తయారు చేసే రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన వ్యక్తులే ఇలాంటి నీచమైన చర్యలకు ఒడిగడితే సమాజంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని వారికి రక్షణ ఎక్కడ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొడుకు బండి భగీరథ్ మీద తప్పుడు పోక్సో కేసు నమోదు అయితే డైలీ సీరియల్ లాగా ఇష్టమొచ్చినట్టు మాట్లాడిన కాంగ్రెస్, బిఆర్ఎస్, టిఆర్ఎస్ కమ్యూనిస్టులు, సెక్యులర్ వాదులు ఇతర నాయకులు ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ బేగ్ విషయంలో ఎందుకు స్పందించడం లేదని కేవలం బండి భగీరథ్ హిందూ అవ్వడమే వల్లనే విషం కక్కారా రహమత్ బేగ్ ముస్లిం అవ్వడం వల్లనే నోరు విప్పకుండా నోట్లో బెల్లం పెట్టుకున్నారా అంటూ నిలదీశారు. రహమత్ బేగ్ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ఏమైనా మేనల్లుడు అవుతారా? అందుకే స్పందించడం లేదా అని ప్రశ్నించారు. అహ్మద్ బేగ్ అత్యాచారానికి పాల్పడినట్లు వీడియోలు బయటకు వచ్చిన పోలీసులు పట్టించుకోకుండా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పుకోవడం సిగ్గుచేటని జరిగిన సంఘటనను సుమోటోగా స్వీకరించి ఎమ్మెల్సీ మీర్జా రహమత్ పై పోక్సో కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని లేనియెడల హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిగిన సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని లేదంటే ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని కాంగ్రెస్ అంటేనే ముస్లింల పార్టీ అని రుజువు చేసుకున్నట్లు అవుతుందని ఎద్దేవా చేశారు.

# చెరుకుపల్లిలో వైద్య సేవల వెల్లువ!

**యశోద ఆసుపత్రి సౌజన్యంతో మెగా వైద్య శిబిరం**
**200 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**






డిండి (గుండ్లపల్లి) ఆగస్టు 30వార్తమిర్రర్::డిండి (గుండ్లపల్లి)మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆసుపత్రి సౌజన్యంతో గ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు, షుగర్, బీపీ, రక్తపోటు తదితర వైద్య పరీక్షలను వైద్య నిపుణులు నిర్వహించారు. సుమారు 200 మంది గ్రామస్తులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంఈ సందర్భంగా సర్పంచ్ మీసాల రామచంద్రయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో యశోద ఆసుపత్రి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా షుగర్, బీపీ, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, యశోద ఆసుపత్రి సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీఆర్సీ సాధన.. సిపిఎస్ రద్దే పిఆర్టియు లక్ష్యం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 30పీఅర్సీ సాధన..సిపిఎస్ రద్దే పిఆర్టియు టిఎస్ లక్ష్యమని ఆ సంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కరానికి సెప్టెంబర్ 1న హైదరాబాద్ లో తలపెట్టిన మహా ధర్నా కు ఉపాధ్యాయులు అధిక సంఖ్య లో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కమిటీకి ఎన్నికయిన రాపర్తి నర్సయ్య, గుర్రం శ్రీనివాస్,పట్టూరి రజితలను సన్మానించారు. జిల్లా కమిటీ లో అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినాపెల్లి ఆనంద్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అంతడుపుల గంగారాజం, దొంతి సతీష్,కన్నవేని మల్లారెడ్డి,రాష్ట్ర నాయకులు పొన్నం రమేష్, బొమ్మకంటి రవి కుమార్, గుండేటి తరంగిని, స్వర్ణలత, సిలివేరి రమేష్, గాజుల కిరణ్, ఉసకోల రాము లు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 30జగిత్యాల జిల్లా రాయికల్ మండల అల్లిపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి రాజమ్మ గంగారాం ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. అనంతరం మండలశీ లోని తాట్లవాయి గ్రామంలో చీటి మంగ రవీందర్ రావు,చిట్యాల కీర్తన గంగాధర్ ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. వారి వెంట ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, పాక్స్ ఛైర్మెన్ రాజలింగం, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ముఖీద్, మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు, నాయకులు దొబ్బల వేణు, రమేష్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, తంగేళ్ళ రమేష్, జాన గోపి, వేముల సతీష్, బీమారాజం, ఎర్రవేణి ఆశాలు, వార్డ్ సభ్యులు జాగిరి ప్రశాంత్, సుతారీ రోజా, అనుమల్ల రాజకుమార్, కల్లెడ గంగాధర్, అత్తినేని వనిత, తదితరులు పాల్గొన్నారు.



# ఆలయ అభివృద్ధికి చేయూత

కల్వకుర్తి ఆగస్టు 30 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఆమనగల్ మండలం రాంనుంతల గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న తండాలో శ్రీ తుల్జా భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్-సీ,ఓ,ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు శ్రీ తుల్జా భవాని మాత నూతన ఆలయ నిర్మాణం, అభివృద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే పవిత్ర కేంద్రాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగి ఆలయాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. తండా ప్రజలు మాట్లాడుతూ తమ ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ గ్రామాలు, తండాల అభివృద్ధికి రాఘవేందర్ రెడ్డి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల సహకారం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లీ పంతు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఆలయ నిర్వాహకులు సీనియర్ నాయక్ పంతు నాయక్, సోమ్లు నాయక్, జగన్, వార్డు సభ్యులు వినోద్, భాస్కర్, సీనియర్ నాయకులు జీంత నాయక్, హుమ్లా నాయక్, లాలూ నాయక్, రమేష్‌తో పాటు గ్రామ పెద్దలు, భక్తులు, తండా ప్రజలు పాల్గొన్నారు.



# వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు చే గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 30

జగిత్యాల రూరల్ మండలం పొలాస పరిశోధన స్థానం దత్తత గ్రామమైన రాయికల్ మండలం ఆలూరులో శనివారం రోజన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ, ప్రాథమిక సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు గ్రామములో వుండే స్థితిగతులపైన చపాతీ పటము ద్వారా, గ్రామ పూర్తి పటం ద్వారా, కాలక్రమేణా పురోగతిని, గ్రామ సమస్యలను వివిధ పటముల ద్వారా పరిశోధన శాస్త్రవేత్తలు, డా. వై. స్వాతి, టీచింగ్ అసిస్టెంట్ శ్రీ. అశ్ఫాక్, అగ్రి హబ్ రూరల్ కోఆర్డినేటర్ దివ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ. నాగరాజు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వామి, గ్రామ పెద్దలు రాంరెడ్డి, రాజు, శేఖర్ ఇంకా పెద్ద సంఖ్యలో గ్రామ రైతులు పాల్గోని కార్యక్రమంను విజయవంతం చేసారు.





# ప్రమాదకరశీగ మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించిన సర్పంచ్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 30

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ నుండి కిష్టంపేట జగిత్యాల వెళ్ళే రోడ్డులో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కోతకు గురై రోడ్డు న ప్రయాణించే వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా ఈ సమస్యను గమనించిన అల్లీపూర్ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్ ఆదివారం రహదారిపై మొరం పోయించి మరమ్మతులు చేపట్టి రహదారిని సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో మరమ్మతు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌ను గ్రామస్తులు, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి, కారోబార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు అరుదైన అత్యున్నత గౌరవం

## "భారత్ కళా వైభవ్--2026" రాష్ట్రస్థాయి అవార్డు ప్రదానం



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్ట్ 30.. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలో ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ధూమ్ ధామ్ -- దమ్ము నీదా? నాదా?" డాన్స్ కాంపిటీషన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు అరుదైన అత్యున్నత గౌరవం లభించింది.సాంస్కృతిక, సామాజిక సేవా రంగాలతో పాటు దివ్యాంగుల సంక్షేమం, హక్కులు, విద్య, ఉపాధి రంగాల్లో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా "భారత్ కళా వైభవ్--2026" రాష్ట్రస్థాయి అవార్డును ప్రదానం చేశారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును డాక్టర్ ఎండీ ఆరిఫ్ వుద్దీన్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ అందుకున్నారు.దివ్యాంగుల హక్కుల కోసం నిరంతర పోరాటం: డాక్టర్ నకరకంటి అశోక్ఈ సందర్భంగా డాక్టర్ నకరకంటి అశోక్ మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కుల సాధన కోసం విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం చేస్తున్న నిరంతర పోరాటానికి లభించిన ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.దివ్యాంగ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కుల పరిరక్షణ కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.దివ్యాంగుల ప్రతిభకు మరిన్ని వేదికలు కల్పిస్తాం: మారవేణి చంద్రశేఖర్ యాదవ్విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ, దివ్యాంగులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు.దివ్యాంగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి కళా, సాంస్కృతిక మరియు ఇతర ప్రతిభా సామర్థ్యాలకు తగిన వేదికలు కల్పించేందుకు ఫోరం మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.దివ్యాంగుల హక్కుల ఉద్యమానికి స్ఫూర్తిదాయకంవిశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు లభించిన "భారత్ కళా వైభవ్--2026" అత్యున్నత గౌరవం దివ్యాంగుల హక్కుల ఉద్యమానికి మరింత స్ఫూర్తినిస్తుందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం, హక్కులు, విద్య, ఉపాధి మరియు సామాజిక గౌరవం కోసం ఫోరం భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పనిచేస్తుందని తెలిపారు.

# సంస్థాన్ లో ఘనంగా ముత్యాలమ్మ వారి బోనాలు- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

## -సాంప్రదాయంగా భక్తి ఐక్యతను చాటిన భక్తులు- స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్





యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు, మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలతో తరలివచ్చి ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు,

### స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ

ముత్యాలమ్మ బోనాలతో నారాయణపూర్ లో ఆధ్యాత్మిక సందడి నెలకొని పండుగ వాతావరణం కనిపించిందని అన్నారు,మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో ముత్యాలమ్మ వేడుకలు కనుల పండుగగా సాగాయని సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక, సామాజిక ఐక్యతకు ప్రతీకగా ఈ బోనాల వేడుక నిలిచిందని అన్నారు. ముత్యాల అమ్మవారి బోనాల లో సాంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తి, ఐక్యతను చాటారని తెలిపారు

# రాష్ట్ర ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయ ఉత్తమ కోచ్ 2026 అవార్డు అందుకున్న- చింతల మచ్చేందర్ ముదిరాజ్



## -ధ్యాన్చంద్ పుట్టినరోజు బెస్ట్ కోచ్ గా అవార్డు అందుకోవడం నా అదృష్టం - చింతల మచ్చేందర్ ముదిరాజ్

యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ఆధ్వర్యంలో ధ్యాన్చంద్ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, సికింద్రాబాద్, జోన్ లలో వివిధ జోన్ లో మల్టీ ఫుల్ యాక్టివిటీస్ విభాగంలో ఉత్తమ కోచ్ గా సెలక్షన్ లో అవార్డు గెలుపొందిన చింతల మచ్చేందర్ ముదిరాజ్ బెస్ట్ కోచ్ గా అవార్డు అందుకోవడం జరిగింది.

అవార్డు గ్రహీత చింతల మచ్చేందర్ ముదిరాజ్

మల్టీ ఫుల్ ఆక్టివిటీస్ విభాగంలో ఎక్స్పీరియన్ పర్సన్ గా అధికంగా అచీవ్మెంట్స్ కలిగి ఉన్న నాకు బెస్ట్ కోచ్ 2026 అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఇక ముందు కూడా చాలా అచీవ్మెంట్స్ ని సాధించి తెలంగాణ పి.టి.సి యొక్క గౌరవాన్ని కాపాడతానని తెలియజేశారు చింతల మచ్చేందర్ ముదిరాజ్

# స్మృతి కాబోయేవాడితో ఉన్న ఈ అమ్మాయ్ ఎవరు.! పలాష్ ఇంత పెద్ద చీటరా.? వైరల్ ఫోటోలు



భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఇప్పుడు కొత్త ట్విస్ట్ బయటపడింది. భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు స్మృతి మంధాన. పెళ్లి కొడుకు తరపున వారు చెప్పినా ఆమె తండ్రి ఆరోగ్యమే ముఖ్యమని చెప్పడంతో.. పెళ్లి ఆగిపోయింది. అయితే అదేరోజు రాత్రి పలాశ్ ముచ్చల్ కూడా అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైరల్ ఇన్ఫెక్షన్, అసిడిటీ వల్ల అతడు ఇబ్బంది పడ్డాడని వైద్యులు వెల్లడించారు. చికిత్స అనంతరం పలాశ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అయితే ఈ విషయానికి సంబంధించి పలాశ్ సోదరి పలాక్ ముచ్చల్ ఇన్‌స్టా వేదికగా స్టోరీ షేర్ చేశారు. 'స్మృతి మంధాన నాన్నగారికి అనారోగ్యం కారణంగా, మంధాన, పలాశ్ వివాహం ప్రస్తుతానికి ఆగిపోయింది. ఈ సమయంలో అందరూ ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నానంటూ పోస్ట్ చేశారు.

# ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?




ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కానీ విదేశీ టోర్నీలలో మాత్రం తన సత్తా చాటాడు. ఇది అటుంచితే కెప్టెన్ గా మాత్రం విఫలమయ్యాడు. ఆడిన 4 మ్యాచ్ లలోనూ ఓటమిపాలై.. పేలవ ప్రదర్శన కనబరిచింది. మరి ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి.ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?ప్రపంచంలోనే రిచ్చెస్ట్ క్రికెట్ లీగ్ అంటేనే ఠక్కున మైండ్‌లోకి వచ్చేది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్). ఈ లీగ్‌లో ఆడాలని ప్రతీ విదేశీ ప్లేయర్ ఉవ్విళ్ళూరుతుంటారు. అయితే ఇంగ్లాండ్ ప్లేయర్స్ మాత్రం కొంచెం డిఫెరెంట్. తమ దేశానికే ప్రాతినిధ్యం ఇస్తామని.. అదే మా ఫస్ట్ ప్రయారిటీ అంటూ వేలంలో అమ్ముడుపోయినా లీగ్ నుంచి అడ్డంగా వైదోలుగుతుంటారు. ఆ కోవకు చెందిన ప్లేయర్ ఇంగ్లాండ్ మాజీ ఓపెనర్ జాసన్ రాయ్. ప్రస్తుతం ఐపీఎల్‌లో జాసన్ రాయ్‌పై రెండేళ్ల బ్యాన్ ఉంది. అయితే మనోడు విదేశీ లీగ్స్‌లో మాత్రం తన సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం అబుదాబీ వేదికగా టీ10 లీగ్ జరుగుతోంది. ఇందులో జాసన్ రాయ్ రాయల్ చాంప్స్ తరపున బరిలోకి దిగాడు. అంతేకాదు ఆ జట్టుకు సారధ్య బాధ్యతలు కూడా చేపట్టాడు. పలు మ్యాచ్‌లలో కెప్టెన్ ఇన్నింగ్స్‌లు ఆడాడు గానీ.. తన జట్టుకు విజయాలు అందించడంలో విఫలమయ్యాడు. మొత్తంగా ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతడి స్ట్రైక్ రేటు 162.71గా ఉంది. ఈ విధ్వంసకర ఓపెనర్ బ్యాట్‌తో తన ప్రతాపం చూపించినా.. కెప్టెన్‌గా విఫలమయ్యాడు. రాయల్ చాంప్స్ ఆడిన 4 మ్యాచ్‌లలో అన్నింటా ఓడిపోయి.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా, జాసన్ రాయ్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.

# మా దగ్గర కోచ్ ఉద్యోగం ఖాళీ లేదు.. గౌతమ్ గంభీర్ కోచింగ్ పై ఐస్‌లాండ్ క్రికెట్ దారుణమైన సెటైర్



భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ టెస్ట్ క్రికెట్ ప్రదర్శన బాగా లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శల పరంపరలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా పాలుపంచుకుంది. తమ %శ% ఖాతాలో.. అభిమానుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. మా దేశానికి కోచ్‌గా ఉండటానికి గంభీర్‌ను పిలవడం లేదు. భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ టెస్ట్ క్రికెట్ ప్రదర్శన బాగా లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శల పరంపరలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా పాలుపంచుకుంది. తమ %శ% ఖాతాలో.. అభిమానుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. మా దేశానికి కోచ్‌గా ఉండటానికి గంభీర్‌ను పిలవడం లేదు. మా కోచ్ చాలా మంచివారు. మా జట్టు 2025లో 75% మ్యాచ్‌లు గెలిచింది అని వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. గంభీర్ టెస్ట్ సమస్యలు ఇప్పుడు దేశంలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా జోక్‌గా మారాయని ఈ పోస్ట్ స్పష్టం చేసింది.2024 మధ్యలో భారత జట్టు కోచ్‌గా గంభీర్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అతని టెస్ట్ రికార్డు ప్రశ్నార్థకంగా మారింది. అతని కోచింగ్‌లో భారత్ 12 ఏళ్లలో మొదటిసారిగా స్వదేశంలో న్యూజిలాండ్‌పై 0-3 వైట్‌వాష్‌తో ఓడిపోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 1-3 తేడాతో కోల్పోయింది. గణాంకాలు చూస్తే గంభీర్ ఆధ్వర్యంలో ఆడిన 18 టెస్ట్ మ్యాచ్‌లలో భారత్ కేవలం 7 విజయాలు, 9 ఓటములు నమోదు చేసింది. ప్రస్తుతం సౌతాఫ్రికా సిరీస్‌లో కూడా దాదాపు ఓటమి అంచున ఉంది. ఈ వరుస ఓటములకు కారణం సరైన ఆటగాళ్ల ఎంపిక లేకపోవడం, గందరగోళమైన వ్యూహాలు, బ్యాట్స్‌మెన్ల దూకుడు ఆట అని విమర్శకులు ఆరోపిస్తున్నారు. స్వదేశంలో, విదేశాల్లో జట్టు పదేపదే తక్కువ స్కోర్‌లకే ఆలౌట్ అవ్వడం, అలాగే స్థిరమైన ఫలితాలు రాకపోవడం గంభీర్ కోచింగ్ సామర్థ్యంపై సందేహాలను పెంచుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌లో గంభీర్ రికార్డు అంత బాగోలేకపోయినా, వన్డే, టీ20 ఫార్మాట్‌లో మాత్రం అతని కోచింగ్ అద్భుతంగా పనిచేసింది. అతని ఆధ్వర్యంలో భారత్ కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ టైటిళ్లను గెలుచుకుంది. ఈ టైటిల్ విజయాలు, టెస్ట్ వైఫల్యాలపై వచ్చిన విమర్శలను కొంతవరకు తగ్గించాయి.